# పిచ్చిగీతలు

నేను ఎప్పుడూ ఏకాకినే.

అనుబంధాలనేవి నాకు లేవు. అన్ని బంధాలూ సాంఘికమైనవేనని నా నమ్మకం. అంతకుమించిన విలువ దేనికీ లేదు.

నిజంగా నాకు తోడు పరమేశ్వరుడొక్కడే. అతడే నిజం.

నాపేరు పరమేశ్వర్రావు.

పరమేశ్వరం, ఏం పేరు! ఉత్తపిచ్చి పాతకాలపు పేరు అనేవాడు కామరాజు చిన్నప్పుడు. నాకు చాలా కోపం వచ్చేది. నా పేరులో ఎంత గొప్ప అర్థం వున్నదో వాడికి తెలియదు. వాడిపేరు ఏం గొప్పగా ఏడ్చింది గనుక అనుకునేవాణ్ని కోపంగా.

నేనెరిగిన పేర్లన్నిటిలోనూ నా పేరు తర్వాత నాకిష్టమైన పేరు చైతన్యప్రభుది.

ఈ ముప్ఫయి ఏళ్ళలోనూ మా ముగ్గురి జీవితాలు దూరమవుతూ మళ్లీ దగ్గరవుతూ ఎన్నివిధాలుగా మారినా చిత్రంగా పెనవేసుకుపోయినై. అందువలననేమో మా ముగ్గురి జీవితాలకూ ఏదో అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది.

ప్రపంచంలో కనిపించని నిజాన్ని కనుక్కోవాలనేది చిన్నతనంనుండీ కూడా నా ఆరాటం, అన్వేషణ. ఆ ప్రయత్నంలో భాగస్తుడుగా నాకు ఆత్మీయుడైనవాడు చైతన్య. అందరూ అతణ్ని 'ప్రభూ' అని పిలిచేవాళ్ళు. నేను మాత్రం 'చైతన్యా' అనేవాణ్ని. అలా పిలవడం నాకో తృప్తినీ, గర్వాన్నీ కలిగించేది. నన్నుడికించడానికే అన్నట్లు తర్వాత కామరాజు కూడా అతన్ని చైతన్యా అని పిలవడం ప్రారంభించాడు. అది నాకు చాల ఉడుకుమోత్తనం తెప్పించేది. చైతన్య నా ఒక్కడికే స్నేహితుడు కావాలనీ, మిగతావాళ్ళను లక్ష్యపెట్టగూడదనీ, ముఖ్యంగా కామరాజును చేరనివ్వగూడదనీ అనుకునేవాణ్ని. చైతన్యమాత్రం అందరితోనూ సమానమైన ఉత్సాహంతో మెసిలేవాడు.

ఎప్పుడో చిన్నతనంలో నన్ను మా అత్తచేతికి ఒప్పగిస్తూ ఎవరో నన్ను గట్టిగా కౌగిలించుకున్నట్లు, కన్నీళ్ళు కార్చినట్లు చిన్న గుర్తు నాలో ఎక్కడో. "మీ అమ్మ దేవత. మీ నాన్న ఉత్తముడు' అన్నారు బంధువులైనవాళ్ళు, ఎప్పుడైనా మా యింటికి

వచ్చినప్పుడు. కాని వాళ్ళు నాకు గుర్తు లేరు.

నేనెరిగినప్పటినుండీ నేను తిరుపతిలో మా అత్తదగ్గరే పెరిగాను. అక్కడ హైస్కూల్లో మేము ముగ్గురం కలుసుకున్నాం. దగ్గర్లోవున్న పల్లెలో కామరాజువాళ్ళకు భూములున్నై. ఇంటిదగ్గర్నుండీ కావలసినంత డబ్బు తెచ్చుకుని ఒక గదిలో ఉంటూ మా క్లాసులో చదివేవాడు. చైతన్య చదువుకోసం వాళ్ళమ్మ స్వగ్రామమైన ముంగిల్‌పట్టు నుంచీ వచ్చేసి తిరుపతిలో కాపురం పెట్టింది.

నేను మా క్లాసులో చదువులో ఎప్పుడూ ఫస్టురాంక్‌లో ఉండేవాణ్ణి. చైతన్య పదోస్థానం దగ్గర్లో ఉండేవాడు. అయినా అతని చురుకుదనం వలననేమో చాలామంది పిల్లలు అతని చుట్టూ చేరేవారు. చదువులో సామాన్యంగా ఉండే కామరాజుకూడా అప్పుడప్పుడు వాళ్ళింటి కొచ్చేవాడు చైతన్యకోసం.

'ప్రపంచంలో చెడ్డవాళ్ళు చాలామంది ఉంటారు. వాళ్లను దగ్గరకు చేరనివ్వకూడదు,' 'బావిగట్టులమీదకి వెళ్లేవు, తోటిపిల్లలు తమాషాకే తోసేస్తారు', 'ఎవర్నీ నమ్మరానికాలం'-మా అత్త రోజూ నా చెవిలో ఇల్లుకట్టుకు బోధించే బోధనల సారాంశం ఇది. ఆమె మాటలు విన్నప్పుడు 'ఏమిటీ పోరుగోల' అనుకునేవాణ్ణి. ఆమె మీద ద్వేషం పుట్టుకొచ్చింది. కాని నేను చిన్నవాణ్ణి. మా క్లాసంతటిలోకీ చిన్నవాణ్ణి. సన్నగా, పీలగా, తెల్లగా పాలిపోయినట్లుండి తరచూ జ్వరంపడుతూ వుండేవాణ్ణి. నేను బలహీనుణ్ణని నాకు తెలుసు. అందువలన అత్తంటే ఎంత కోపంవున్నా, ఆత్మ సంరక్షణార్థం ఆవిడ మాటలు మనసులో మెదుల్తూనే వుండేవి ఎప్పుడూ. వద్దనుకుంటూనే ఆమె మాటల్ని పొల్లు పోకుండా ఆచరించేవాణ్ణి. నమ్మేవాణ్ణి. బావిగట్టునేకాదు, ఎక్కడా ఎవర్నీ నమ్మలేదు నేను.

మా క్లాసులో అందరూ నాకంటే పెద్దవాళ్ళు, బలవంతులు. కామరాజు అందరికంటే బలంగా దృఢంగా వుండేవాడు. మంచి ధైర్యశాలి. కాని మంచివాడు మాత్రం కాదు. నేను స్కూలుకు వెళ్తుంటే 'ఒరే పరమం. నా పుస్తకాలు కూడా మోసుకు రారా' అని నా చేతిలో పెట్టేవాడు దోవలో కనపడగానే. 'నేను ఎందుకు మొయ్యాలి? మొయ్యను' అందామని నాకు మనస్సులో వుండేది. కాని అలా అంటే ఏమి చేస్తాడోనని భయపడి మాట్లాడకుండా వాడి పుస్తకాలు రోజూ మోసేవాణ్ని. వాడంటే లోపల కోపం. ఆటల్లోనూ వాడు ముందుగా వుండేవాడు. నేను ఆటల జోలికి పోయేవాణ్ని కాదు. స్కూల్లో చదువుతున్న రోజుల్లోగాని తర్వాతగాని నేను నిజంగా స్నేహభావంతో దగ్గరకు రానిచ్చింది చైతన్యను మాత్రమే.

## 2

చదువులయ్యాక నేను రెవిన్యూ డిపార్టుమెంట్‌లో చేరాను. చైతన్య

ఫారెస్ట్‌రేంజర్‌గా చేరాడు. ఆ డిపార్ట్‌మెంట్‌లోని అవినీతి, లంచగొండితనాలకు దూరంగా వుండాలని ప్రయత్నించాడు. కాని అతని పద్ధతివలన అతని క్రింద ఉద్యోగులకు మామూళ్ళు దొరక్క నష్టం కలిగింది. అది సహించలేక ఒక రోజు రాత్రిపూట ఒక గార్డు బాగా తాగి అతన్ని పొడవడానికి కత్తి తీసుకువచ్చాడు. తర్వాత చైతన్య ఆ శాఖలోనే రిసెర్చి విభాగానికి మార్పించుకున్నాడు. పై రాబడిలేని ఆ ఉద్యోగం కావాలనే వాళ్ళుండరు గనుక అందులోనే వుండిపోయాడు. తాను లంచం పట్టడు గనుక, పట్టేవాళ్ళను హీనంగా తలవటం అతని పద్ధతి కాదు. వాళ్ళతోనూ సరదాగా స్నేహభావంతోనే ఉండేవాడు. 'నాకు జీవితాన్ని గురించి దృక్పథమంటూ ఏమీలేదు. చేయవలసిన పనిని మనసుకు తోచినట్లు సక్రమంగా న్యాయంగా చేసుకుపోవడం, ఉన్నదానితో తృప్తిపడటం, అందినంతవరకూ ఆనందంగా జీవితాన్ని అనుభవించడం-ఇదే నాకు తెలిసింది' అనేవాడు. ప్రవర్తనలో మా యిద్దరిదీ ఒక్కటే పంథా. కాని లోకాన్ని చూసే దృష్టిలో యిద్దరికీ తేడావున్నది. యం.యస్సీలో క్లాసురాక సొంతవూళ్ళోనే హైస్కూలు టీచరుగా చేరాడు కామరాజు.

తరువాత చైతన్య పెళ్ళిలో కలుసుకున్నాం ముగ్గురం. డబ్బు ఎక్కువలేకపోయినా మంచి కుటుంబానికి చెందిన చక్కని పిల్ల శ్రీలక్ష్మిని వరించి చేసుకున్నాడు చైతన్య.

కామరాజుకు అప్పటికే పెళ్ళయింది. చదువుకుంటున్నప్పుడు తోటి విద్యార్థిని అయిన ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. కొంత ప్రేమకథ నడిచాక తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన అందమూ, డబ్బూ కూడా తెచ్చిన పిల్లను చేసుకున్నాడు. నేను అందరికంటే ఆలస్యంగా పెళ్ళి చేసుకున్నాను. అత్త తన కూతురు నిర్మలను నేను చేసుకోవడం నిశ్చయమైపోయినట్లే భావించేది. నా యిష్టానిష్టాలతో ప్రమేయం లేకుండానే నాచేత తాను తలపెట్టిన పనులు చేయించగల శక్తి వుండేది ఆమెకు మొదట్నుండీ. ఆమె అనుకున్న పనులు నేను చేస్తున్నకొద్దీ ఆమెమీద కసి పెరిగిపోయింది నాలో. ఆడవాళ్ళ అచ్చెమ్మ బుచ్చెమ్మ కబుర్లు తప్ప మరేం మాట్లాడలేని నిర్మలతో పెళ్ళయినా నాకేవిధమైన అనుబంధమూ ఏర్పడనే లేదు. కాని పెళ్ళి చేసుకున్నందుకు నిర్మలనూ మా ఇద్దరు కొడుకులనూ భరించవలసి బాధ్యతను అంగీకరించాను. బాధ్యతల్నుండీ పారిపోవడం నా స్వభావం కాదు.

ఈ విధంగా మా మా జీవితాల్లో స్థిరపడిపోయిన వాళ్ళం, ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ చిత్తూరులో తటస్థపడ్డాం. నాకు చిత్తూరుకు ట్రాన్స్‌ఫరయిన కొద్దికాలానికే చైతన్య డి.ఎఫ్.ఓ. రాంక్‌లో ఒక రిసెర్చి ప్రాజెక్టులో చిత్తూరికి వచ్చాడు.

నేను వూరికి పెడగా దూరంగా ఉండే ఇంట్లో ఉంటున్నాను, ప్రశాంతంగా

ఉంటుందని. ఇంటికి ఎదురుగా కొద్దిదూరంలో పెద్దకొండ-ఎత్తుగా, హుందాగా, నీలాకాశంలో అర్థంకాని ఆకారాన్ని గీస్తూ. ఆ కొండపైన అవతలి ప్రక్కన సుబ్రహ్మణ్యేశ్వరుడి గుడి కూడా ఉన్నది. అది మావైపుకు కనిపించదు. ఇటువైపు కనిపించేది, మా ఇంటికెదురుగా చిన్న మంగుళూరు పెంకుల ఇల్లు. దాని వెనకనుండి ప్రారంభమై కొండపాదంవరకూ ఏవో కట్టడాలు. కాలంతో నల్లబడి, విశీర్ణమవుతున్న ముస్లిం సాంప్రదాయపు కట్టడాలు-ఏవో పురాతన శిథిలాల్లాగా. జీవితానికి సంకేతంలాగా నిలిచివున్న ఆ కొండ క్రింద యీ శిథిలాలు ఎంతో అర్థాపత్తితో కనిపించేవి. తర్వాత అవి గత శతాబ్దికి చెందిన తెల్లదొరల సమాధులని తెలిసినా ఆ దృశ్యపటంలో అవీ భాగంగా నిలిచిపోయాయి. తీరిక చిక్కినప్పుడంతా ఆ కొండను చూస్తూ దాని అర్థాన్ని వెతకటం అలవాటైపోయింది నాకు. ఉషఃకాలంలో, మిడిసిపడే ఎండలో, వాన ముసురులో, మబ్బులో-ఎన్నో విధాలుగా ఆ కొండని చూచాను. ఒక్కోసారి ఒక్కోరకంగా దర్శన మిచ్చింది అది. కొండదగ్గరగా, కొండప్రక్కనే , కొండతో కలిసి జీవించడం ఒక అపూర్వ మయిన అనుభవం.

అప్పుడప్పుడు చైతన్య మా యింటికొచ్చేవాడు. ఇద్దరం కలిసి కొండపైకి వెళ్ళేవాళ్ళం. ఒక్కోసారి ఏదైనా చర్చించుకునే వాళ్ళం. ఒక్కోసారి వూరికే మాట్లాడకుండా, వెళ్లి కూర్చుని తిరిగి వచ్చేవాళ్ళం. ఆకాశానికీ కొండలకీ ప్రకృతికీ చెందిన ప్రశాంతత మా మనసుల్లో, శరీరాల్లో చల్లగా నిండిపోయేది. ఈ విధంగా మేము పొలుపంచుకున్న అనుభవాలు నాకెంతో విలువైనవి. చైతన్యకు ఇతర స్నేహితులుండేవారు. అతను యీ అనుభవానికెంత విలువనిచ్చేవాడో ఆ స్నేహితులతోడి లోకాభిరామాయణానికీ, పేకాటకూ, రాజకీయ చర్చలకూ, సినిమాలకు కూడా అంత విలువనిస్తున్నట్లు కనిపించేవాడు. క్షణికమైన ఈ జీవితానికి విలువలేదు నా దృష్టిలో. ఈ జీవితానికి పరిమితంకాని 'నిజాన్ని' కనుక్కోవాలని నా ప్రయత్నం. 'దేవుడను, జీవాత్మఅను, లేక వూరికే జీవితం అనో , కారణం అనో ఏమైనా అను-ఏ కారణంవలన మనకు ఈ జీవితం కలిగిందో, ఆ కారణం వలననే మనం దాన్ని నిండుగా ఆనందంతో అనుభవించవలసిన అవసరం కూడా కలిగింది. జీవితాన్నుంచీ దూరంగా పోవటం సరియైన పద్ధతి కాదు' అంటాడు చైతన్య. పైకి ఎలా చెప్పినా జీవితపులోతుల్ని తరచి చూచే తత్వం అతనికీ ఉన్నది. అదే మా యిద్దరినీ కలిపిన బంధం.

ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న తన స్వగ్రామంలో హైస్కూలు హెడ్మాస్టరుగా ఉంటున్న కామరాజు ఏ పని మీదనో చిత్తూరికి వచ్చినప్పుడు మమ్మల్ని పలకరించకుండా వెళ్లేవాడు కాదు. మా ఇద్దరి కంటే ఎంతో అధికుడైన తాను, మాకంటే ఉద్యోగరీత్యా తక్కువస్థాయిలో ఉండవలసివచ్చినందుకు అతని బాధ, కుళ్లు అతనిమాటల్లో

తొంగిచూసేవి. ఒక్కో సాయంత్రం చైతన్యతో కలిసివచ్చి మాతో కొండమీదకు వచ్చేవాడు. మా ఏకాంతంలోనికి అతను జొరబడడం నాకు సహించరానిదిగా ఉండేది. ఏదీ అర్థంకాకుండానే అన్నీ తెలిసినట్లు మాట్లాడ్డం, ప్రతి విషయంలోనూ వితండవాదం చెయ్యడం, అహంభావం- అన్నీ ఇదివరకు ఇంటర్ చదివే రోజుల్లో ఎలా వుండేవో యిప్పుడూ అలానే వున్నాయి. అప్పుడూ కొండరోడ్డున సాయంత్రాలు షికారుగా వెళ్తున్నప్పుడు ఇలాగే ప్రతిదాంట్లో కలగజేసుకునేవాడు. అప్పుడు మేము చిన్న విషయాల్ని గొప్ప సమస్యలుగా చర్చించుకునే రోజులు. ఆనాటి వాదనల్లో కొన్ని నాకు గుర్తున్నవి యింకా.

ఒకనాడు ఏదో విషయం మీద మాట్లాడుతూ

"మనం తినడానికి బతుకుతున్నామా? బతకడానికి తింటున్నామా?" అన్నాను. తిండి అవసరం బతకడంవరకే (కాని బతుక్కి ప్రయోజనం జీవితపు లోతుల్ని తరచిచూడడం) అన్న ఉద్దేశంతో అన్నాను, కాని ప్రశ్నగా అడగలేదు.

ఇంతలోనే కామరాజు కలగజేసుకుని పెద్ద తెలివిగలవాడి పోజుపెట్టి

"బతుకులో తిండి ఇచ్చినంత తృప్తి మరేదీ ఇవ్వనప్పుడు తినడానికే బతుకుతున్నామంటే తప్పేమిటి! తినడంలో తృప్తిలేనట్లు వేషాలు వేస్తూ బతకడానికే తింటున్నాం అనేవాళ్లను చూస్తే నాకు గిట్టదు" అన్నాడు.

కావాలని నన్నుద్దేశించే అంటున్నాడని నాకు తెలుసు.

"స్పష్టంగా అందరికీ తెలుస్తుండే విషయాన్ని కాదని వాదించినంతమాత్రాన పెద్ద సైంటిస్టువు కాబోవులే" అన్నాను.

"పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచీ ఎవరో చెప్పినమాటల్ని నమ్మి సొంత ఆలోచన ఎరగని పెద్దలు మన చెవుల్లో నూరిపోస్తే, దాన్ని నీవు స్పష్టమైపోయిన విషయంగా నమ్ముతున్నావు. ప్రతిదాన్ని ప్రశ్నించే శాస్త్రజ్ఞుణ్ని నేను" అన్నాడు కామరాజు.

అతను సైన్సు గ్రూపు, నేను ఫిలాసఫీ గ్రూపూ తీసుకున్నప్పణ్నుంచీ తను పెద్ద శాస్త్రజ్ఞుడై పోయినట్లు వితండవాదాలు చేస్తూ, పోజులు పెట్టడం జాస్తి చేశాడు కామరాజు.

అతని మాటల్తో నాకు లెక్కేమి టన్నట్లు చైతన్య అభిప్రాయంకోసం చూశాను.

"బతికి సాధించవలసిందీ ఉన్నది, తినడం లో తృప్తీ ఉన్నది. ఆ రెండింట్లో ఏదో ఒకటి ఎన్నుకోవాలని ఎక్కడున్నదీ" అన్నాడు పెద్ద అమాయకుడిలాగా చైతన్య.

ఒకటి విలువైందిగా ఎన్నుకోవాల్సిన అవసరం లేనట్లూ, అన్నీ అందరూ కావలసినట్లూ 'మాట్లాడ్డం' అతని ప్రత్యేకత. కామరాజు నడిమధ్యన దూరకుంటే నా మాటల్ని సుళువుగా అంగీకరించి ఉండేవాడని నాకు తెలుసు.

మేం ముగ్గురం కలిసివెళ్తే కామరాజు లోకాభిరామాయణం తప్ప మరే విషయమూ ఉండదు. కామరాజుకు వాదనల్లో ఆసక్తిగాని, ఏ విషయాన్నయినా తరచి చూడగల శక్తిగాని లేదు. అందువలన తనలోతుకు మించినదేమైనా వినబడితే "ఏం గోల నాయనలారా, ఇహ ఆపండి' అని కేకలేస్తాడు. నిజానికి అతను మాతో కలిసి రావలసిన అవసరం లేదు. అసలెందుకు వస్తాడనేది నాకు అర్థమూ కాదు. మా దగ్గర అతనెప్పుడూ పెరవాడే.

ఇప్పుడదీ లేదుగాని చదువుకునే రోజుల్లో యిలా బయటకు వచ్చినప్పుడు కామరాజు పాటలు పాడేవాడు. అతనికి ఒకరకం పాటలు పాడటం బాగానే వచ్చును. సరదాగా పెద్దగా పాడేవాడు. చైతన్యకు పాటలో కరిగిపోయే గుణం వున్నది. నాకు పాటలో అర్థం ముఖ్యం. ఆ పాటను విని ఆనందిస్తున్న 'నేను' ఎప్పుడూ మరుగుకుపోదు. అది కూడా మా చర్చలకు కారణమయ్యేది అప్పుడు.

"సరస్వతీదేవి చేతిలో అంత ప్రముఖంగా వీణ ఎందుకున్నది? సంగీతం యొక్క స్థానాన్ని నిరూపించడానికే" అన్నాడు చైతన్య ఒకసారి.

"ఆమె వాగ్దేవి గనుక. సంగీతంకూడా సాహిత్యంలాగా వాక్కులాగా అందని దాన్ని చూపేది గనుక" అన్నాను నేను.

"సాహిత్యానికి సంగీతంతో సమానమైన స్థానం ఎక్కడున్నది? మాటపరిమితమైనది. పరిమితమైన దానిద్వారా అపరిమితమైనదాన్ని ఎలా చూడగలం? సంగీతం అట్లా కాదు. మాటకూ అర్థానికీ అతీతమైన పథంలో మనస్సుని అందుకొని లాక్కెళ్ళేశక్తి దానికున్నది. అది సాహిత్యంకంటే గొప్పది" అన్నాడు చైతన్య.

"దానికి శాశ్వతత్వంలేదు. విన్నంతసేపే దాని ప్రభావం. అర్థం అనేది మనసులో ఏర్పడితే మరి చెరిగిపోదు. అందువలన సాహిత్యమే గొప్పది" అన్నాను.

చైతన్యా నేను ఏ వాదనలోనూ ఏకీభవించకుండానే ఒకర్నొకరు అర్థం చేసుకోగలం, గౌరవించగలం.

## 3

ఒక మొగ్గ పుడుతుంది. ఒక పువ్వు పూస్తుంది. మరోటి వాడి రాలిపోతుంది. అన్ని విషయాలూ ఎంతో సామాన్యంగా జరిగిపోతాయి. మనిషి జీవితంలోనూ అంతే. ఆ సంఘటనలకు పరస్పర సంబంధాన్ని ఆరోపించేదీ, అర్థం కల్పించుకునేదీ మనస్సు. జరిగేవి మాత్రం ఏ ఆర్భాటం లేకుండా జరిగిపోతూనే వుంటాయి.

"... ఇదేమాదిరిగా ఉత్తరాన్ని పధ్నాలుగు కార్డులమీద వ్రాసి నీకు తెలిసినవాళ్ళు పధ్నాలుగురికి వారంరోజుల్లోగా పంపాలి. ఇది తప్పినచో నెలరోజులలోపు నీవు

సర్వనాశనమైపోతావు." కామరాజు సంతకంతో చైతన్యకు వచ్చింది ఉత్తరం.

కూతురి పెళ్లి మధ్యలో ఉన్నాడు చైతన్య. చైతన్యకు భార్యాబిడ్డలమీద మమకారం జాస్తి. ఆ పిల్లకు అనుకోకుండా గొప్ప సంబంధం కలిసివచ్చి యీ పెళ్లి జరుగుతున్నది. చాలా సంతోషంగా ఉత్సాహంగా వున్నాడు. ఆ ఉత్తరాన్ని నాకు చూపించి నవ్వి "నాకు యిటువంటివాటిలో నమ్మకంలేదు" అంటూ చించేశాడు.

పెండ్లికి రాకపోగా, శుభాకాంక్షలైనా పంపకపోగా, పైగా ఇటువంటి ఉత్తరం పంపడం కామరాజు స్వభానికి తగినట్లుగానే ఉన్నది అనుకున్నాను. కామరాజు కూతురికి యింతకుముందే పెళ్ళి చేశాడు. డబ్బు బాగా ఖర్చుపెట్టి ఘనంగా చేశాడు. కాని అతని అల్లుడు సామాన్య ఉద్యోగి. చైతన్య క్లుప్తంగా పెళ్ళి చేస్తున్నాడు. ఇతని అల్లుడు అందంలో, బుద్ధిలో, డబ్బులో, ఉద్యోగంలో మిన్నగా ఉన్నాడు.

పెళ్లి వారందరూ చైతన్య స్వగ్రామమైన ముంగిల్‌పట్టు వెళ్ళిపోయారు.

తిరుపతికి పదిమైళ్ళ దూరంలో చిత్తూరు రోడ్డులో ఉండే చిన్న పల్లె అది. దేవుడి కొండ ముంగిట్లో ఎత్తయిన కొండల నడుమ, కోనలో, ఏటి వారన పదిమిద్దెలూ, పదిపూరిళ్ళూ, వాటిచుట్టూ కొద్దిపాటి పంట భూములూ కలిసి ఏర్పడింది. చుట్టూ ఐదు మైళ్ళలో మరో పల్లెగాని జనసంచారంగాని లేదు. అది నిజంగా వూరు కాదు. చైతన్యను ప్రసవించడానికే ఏర్పడ్డ ప్రకృతిమాత గర్భం.

అందరూ కలిసి వూరిబయటగా వాళ్ల మామిడితోటలో వనభోజనం ఏర్పాటు చేసుకున్నారు. పులిహోర, దద్ధోజనం, గారెలు, మిఠాయిలు, పండ్లూ, తమలపాకులకట్టలూ, కంబళ్ళూ తీసుకుని వెళ్ళారు. మధ్యాహ్నం భోజనాలయ్యాక చేతులు కడుక్కోడానికి అక్కడే కరెంట్ మిషన్ వేసివున్న బావినీళ్ళు తీసుకురావడానికి చైతన్య భార్యా, కొడుకూ, అల్లుడూ వెళ్ళారు. తొట్టిలో నీళ్లు ముంచిన శ్రీలక్ష్మి కరెంట్‌షాకుతో వెర్రికేక వేసింది. ప్రక్కనేవున్న కొడుకు అల్లుడూ ఆమెను లాగబోయి వాళ్ళూ విద్యుద్ఘాతానికి గురయ్యారు.

కేకవిన్న చైతన్య ఒక్క పరుగున వెళ్ళాడు. భార్యా, కొడుకూ, అల్లుడూ అతని కళ్లముందర విలవిలా తన్నుకుంటున్నారు. మరో ఆలోచన లేకుండా భుజంమీద టవలు తీసి ముందున్న శ్రీలక్ష్మి చుట్టూ వేసి బలంకొద్దీ లాగాడు. వాళ్లు ముగ్గురూ ఇవతల పడిపోయారు. అదే వూపులో చైతన్య ప్రక్కనేవున్న ప్రమాదకరమైన కరెంటు స్తంభంమీద పడిపోయాడు. ఏ ప్రకృతిమాత అతనికి జీవశక్తినిచ్చి లోకంలో ఆడుకోడానికి పంపిందో అదే తల్లిలో లీనమై పోయింది అతని ప్రాణశక్తి.

ఆ పెళ్ళిలో అతన్ని చూడ్డమే ఆఖరు చూపు నాకు. చైతన్య లేడనే విషయం నా మనసుకు అందటం లేదు. మా ఇంటి ఎదురుగా ఉండే కొండను చూస్తాను.

"ఆకాశంలోని ఆ నల్లమబ్బులు నా జటలైనట్లు, భువనభోంతరాళాలునిండిన రూపంగల పరమశివుణ్నాయి నేను యీ కొండమీద నిలుచున్నట్లు వున్నది" అన్నాడు చైతన్య ఒకసారి.

ఆ కొండమీద ఆకాశం క్రింద సుబ్రహ్మణ్యేశ్వరుడి గుడి గంటల మోతలో అర్చకుల మంత్రపఠనపు శబ్దంలో నా ప్రక్కనే చైతన్య లేకుండా ఎలా ఉంటాడు! అయోమయంలో పడిపోయింది నా మనసు. నా ఆలోచన, తర్కం, అన్వేషణ ఏమైపోయాయి? పుట్టినవాళ్లు చావడం సహజం. ఎవరున్నా లేకున్నా యీ విశ్వం కాలప్రవాహంలో కదిలిపోతూనే ఉంటుందనీ తెలుసు. కానీ... ఈ ప్రపంచాన్ని మాయ అనీ, అన్ని అనుబంధాలు సాంఘిక బంధాలు మాత్రమేననీ నిశ్చయించుకోగల నా మనసు ఈ చైతన్య విషయంలో యిలా చిక్కుబడిపోయిందే! మేము కలుసుకున్నప్పుడు స్నేహితులం. నిజాన్ని గురించిన అన్వేషణలో భాగస్తులం. అంతే. అతను సంవత్సరాల తరబడీ కనిపించకపోయినా నాకు అదొక లోటుగా అనిపించదు. చిరకాలానికి అతను కనిపించినప్పుడు గొప్ప ఆనందమేమీ కలగలేదు. కాని... ఇప్పుడు...

"మన మిత్రుడు చైతన్యప్రభు చాలా మంచివాడు. కాని ముందు చూపు కలవాడుమాత్రం కాదు. ఇంకో పదేళ్లపాటు ఉద్యోగం చేసి కొడుకుల్ని చదివించుకుని పైకి తేగలనన్న నమ్మకంతో కుటుంబం కోసం అతను ఏమీ నిలువ చెయ్యలేదు. అతని కుటుంబానికి సహాయం చెయ్యాలన్న ఉద్దేశంతో చైతన్యప్రభు కుటుంబ సంక్షేమనిధి అనే పేరుతో ఒక నిధి ప్రారంభిస్తున్నాము. దానిగ్గానూ ఒక కమిటీ ఏర్పాటైంది. మిత్రులందరూ తోచినవిధంగా ఆ కుటుంబానికి సహాయపడవలసినదిగా అర్థిస్తున్నాము."

కామరాజు మిత్రులందరికీ రాశాడు. అతను అయిదువందలు వేశాడు నిధికి.

చైతన్య ఆత్మగౌరవం కల మనిషి. న్యాయంగా తనకు లభించిన దానితో సర్దుకుపోయి తృప్తిపడటం అతనిస్వభావం. డబ్బు ఎక్కువగా కావాలనీ, అదే మనిషి మనుగడకు ముఖ్యమైనదనీ అది వున్నకొద్దీ ఎక్కువ సుఖంగా బతకొచ్చుననీ అతను ఎప్పుడూ అనుకోలేదు. అతను తన కుటుంబాన్ని ప్రేమించాడు. వాళ్లు సుఖంగా వుండాలనే అనుకున్నాడు. బాధ్యతారహితంగా అతను ఎప్పుడూ ప్రవర్తించలేదు.

ముంగిల్‌పట్టులో అతనికి ఇల్లున్నది. కొద్దిగా తోటా, భూమీ వున్నది. అతని ప్రావిడెంటు ఫండు కొద్దిగా వస్తున్నది. అతని కుటుంబానికి తిండికి లోటుండదు. వాళ్లు యిప్పుడున్న స్థాయిలో జీవించలేకపోవచ్చును. అతని కొడుకులు పెద్ద చదువులు చదవలేక పోవచ్చును. అయినా చైతన్య జీవితాన్నే అబద్ధం చేస్తూ హేళన చేస్తూ ఉన్నది యీ నిధి. కొంత వెసులుబాటుకోసం అతని కుటుంబం ఇతరుల దయా ధర్మాల్ని

స్వీకరించడం అతనికి దుఃఖం కలిగించదా? ఇతరుల డబ్బు ఒక్క పైసాకూడా ముట్టుకునే మనిషి కాడతను.

ఆ నిధి సంగతి తలచుకున్నకొద్దీ నాలో ఉద్రేకం పొంగుకొచ్చింది. చైతన్య మీద గెలుపొందడానికి కామరాజు ప్రయత్నమా ఇది!

"...నేను అదే ఉత్తరం పద్నాలుగురికి పంపాను. వాళ్లు చావాలని పంపలేదు. ఊరికే పంపాను. అది చదివి అతనిష్టప్రకారం చేసుకుంటాడు. అది చదివి అతను చస్తానని భయపడ్డాడా? నన్నేమైనా అన్నాడా? మధ్యన నీ బాధ ఏమిటి?

"నీ ఆదర్శాలూ, వట్టి మాటలూ అతని కొడుకులకు చదువులు చెప్పిస్తాయా? మనిషి బతకటానికి కావలసింది మాటలు కాదు. డబ్బు. డబ్బు ఇవ్వాల్సి వస్తుందంటే అందరూ తలొక ఆదర్శమూ వల్లిస్తారు, తప్పించుకోడానికి. ఈ దేశమే దొంగసన్యాసుల దేశమయ్యా. అది మన జాతి గుణం. చిన్నినా బొజ్జకు శ్రీరామరక్ష అంటూ కడుపునిండా కావలసినవన్నీ మెక్కి కూర్చుని అవతలి వాళ్ళకి అవన్నీ అక్కర్లేదనీ మిథ్య అనీ బోధించే రకం.

అయనే వుంటే మంగలెందుకన్నట్లు ఆ చైతన్య వుంటే అతని కుటుంబానికి ఒకరు సాయపడాల్సినపనేముంటుంది! అతను లేడని కదా చెయ్యాల్సివస్తున్నది. ఒక మంచిపని చెయ్యాలంటే అడ్డుపుల్లలు వేసేవాళ్లు కొల్లలుగా వుంటారు.

నీవు డబ్బు ఇవ్వకపోతేమానెగానీ వెళ్లు స్వామీ! నీకో నమస్కారం. మేము అన్నం తిని బతికే సామాన్యులం. సామాన్యంగానే బతుకుతాం..." అన్నాడు కామరాజు.

అక్కణ్నుంచీ మారు మాట్లాడకుండా వచ్చేశాను. నా మనస్సు ఆవేశంతో, ఆవేదనతో ఉడికిపోతున్నది. అతని ఆరోపణలకి నా దగ్గర సమాధానం లేదా? ఇందులోని నిజం చెప్పగలవారెవ్వరు? రెండువైపులా పదునుగలిగి ఎట్లయినా నరుక్కుపోగల మనసులాంటిదేనా నిజంకూడా? చైతన్య అలా ఒప్పుకోడు. 'నాకు తెలుసు' అంటాడు. 'నాక్కావలసిందంతా నాకు తెలుసు' అంటాడు. 'నాకు సందేహాలు లేవు' అన్నాడు ఎన్నోసార్లు. ఇప్పుడతనికి అన్నీ ఇంకా ఎక్కువగా తెలిసుండాలి. కాని అతనికి తెలిసిందేమిటో నాకెలా తెలుస్తుంది!

కొన్నిసార్లు విషమపరిస్థితుల్లో శరీరాన్ని విడిచి, రూపరహితమైన ఆత్మలు పాతరూపాన్ని ధరించి మనుష్యులతో మాట్లాడినట్లు చెబుతారు. ఒక ప్రాణి యీ దేహంతోనే నశించిపోకుండా ఏమైనా మిగిలుంటే-ఈ పరిస్థితుల్లో చైతన్య నాకు ఎందుకు కనబడడు?

అలాగ చైతన్య స్వయంగా వచ్చి "పరం, మనిషంటే భౌతిక విషయాలకు బద్ధమై కనిపించేది మాత్రమేకాదు. ఈ కనిపించేది శాశ్వతమైనది కాదు. ఒకే పరిస్థితుల్లో ఉన్నా

ఒక మనిషికీ ఇంకో మనిషికీ తేడా ఉంటుంది. అది. అతని గుణాలకు మూలం. అతని స్వభావం. అతని నిజం. అది ఉన్నది... నేను ఆత్మాభిమానం కలవాణ్ని. నా భార్యాబిడ్డలూ మరొకరి దయాభిక్షతో పైకి రావాలని నేను అనుకోను. అది నాకు ఇష్టం వుండదు. వాళ్ళు నా వాళ్ళు... 'నా' వాళ్లు... నన్ను సరిగ్గా తెలుసుకున్న వాడివి నువ్వే... మనిద్దరం ఒకటి..." అని చెప్పాలి.

ఎందుకు చెప్పడు? అతనికోసం నేనుపడే ఆవేదన అతనికి తెలియదూ! అతను నాకు ఆత్మీయుడు. నేను తీవ్రంగా వాంఛిస్తే అతను నాకు కనిపించి తీరుతాడు. నాకు తెలుసు!

మనసును కేంద్రీకరించి తీవ్రంగా అతన్నే భావిస్తూ కళ్ళు మూసుకు కూర్చున్నాను.

ఎంత సేపు కూర్చున్నా అతను కనిపించలేదు.

అలసట కలిగింది. పడక్కుర్చీలో కళ్ళు మూసుకు పడుకొని నిద్రపోయాను.

## 4

సంధ్యవేళ నిద్రనుండి లేచేసరికి ఉదయం నుండి నేను పడిన ఆవేదన తాలూకు ఛాయకూడా లేకుండా మనసు తేటపడింది.

కళ్ళు తెరవగానే ఎదురుగా కిటికీలోంచి కనిపిస్తున్న దృశ్యం అసాధారణంగా వున్నది. కిటికీలోంచి ఎర్రటి వెలుతురు కళ్ళను తాకుతున్నది. ఎరుపు. బయటంతా అసహజమైన ఎరుపు. ఏమిటి సంగతి? ఇంత ఎరుపు ఎక్కణ్ణుంచి వస్తున్నది? అనుకుంటూ లేచి కిటికీ దగ్గరకు వెళ్ళాను. ఎదురింటి మంగుళూరు పెంకులు యీ స్వచ్ఛమైన ఎరుపును యీనుతూ వాటి రూపురేఖల ప్రత్యేకతలను స్ఫుటం చేస్తున్నవి. అవి యిటువంటి కాంతితో, యింత స్పష్టతలో ఇంతకుముందెప్పుడూ కన్పించలేదు! ఆ వెనుక ఎత్తుగా ఠీవిగా, ఆకాశాన్నంటుతున్న కొండ జీవకాంతిని వెలార్చుతున్నట్లు. దాని పెద్ద గుండ్లు వేటికవిగా తమతమ ప్రత్యేక దర్శనమిస్తున్నవి. ఆ గుండ్ల నడుమనున్న గడ్డి తుప్పలు నవనవలాడుతూ పచ్చని గాంభీర్యాన్ని వెల్లడిస్తున్నవి. వెనుక వెనుగ్గావున్న రకరకాలచెట్లు తేటైన పచ్చదనాల్తో తమ రూపురేఖల్ని బహిర్గతపరుస్తూ సుందరంగా వున్నాయి. పలు వర్ణచిత్రాల ఆభిజాత్యప్రదర్శనల సద్దులేని సందడి యీ నేత్రోత్సవం!

ఈ ప్రపంచంలోకి ఇంత తేటదనం ఎలా వచ్చింది? చీకట్లలోనికి జారిపోబోతున్న సూర్యుడు ఇంతవరకూ తాను లక్ష్యం లేకుండా చూసిన ప్రపంచపు నిజస్వరూపాన్ని, చూస్తున్నట్లున్నాడు. ఎంత సౌందర్యం!

మెరుపుల భేషజాలు లేని ప్రపంచం తపస్సమాధిలో వున్న యోగిలాగా వున్నది.

అన్ని వస్తువులూ వాటి సొంతమైన, నిర్మలమైన కాంతులనీనుతూ ప్రకాశిస్తున్నాయి. మనసు కొత్తలోకంలోకి ప్రవేశించింది. ఈ వెలుగులో నీడలేదు. ఇది నిజం!

ఆలోచిస్తున్నవాడిని ఎందుకో పక్కకు తిరిగాను. వాకిట్లో నిలబడి ఉన్నాడు ఎవరో అతను. మాటా పలుకూ లేకుండా, ఏ భావం లేకుండా నిలుచుని వున్నాడు. అతని చొక్కా చిరుగులోంచీ పచ్చగా మెరిసే ఒళ్ళు కనిపిస్తున్నది. ఆకలితో ఉన్నట్లు కనబడుతున్నాడు. అతను నవ్వడం లేదుగాని అతని మొహంలో ఏదో చిరునవ్వు కనిపిస్తూ చూసేవాళ్ళకు సద్భావం కలిగిస్తున్నది. అతను స్నేహపాత్రుడుగా కనిపిస్తున్నాడు.

అతన్ని ఇంతకుముందు ఎక్కడో చూచానన్న భావం మెదులుతున్నదిగాని సరిగ్గా గుర్తులోకిరావడంలేదు.

"ఎవరండీ మీరు?" అడిగాను.

"నన్ను మీరెరుగుదురు. మరచిపోయారేమో. మీరు నాకు బాగా తెలుసు" అన్నాడు నవ్వకుండా నవ్వుతూ.

నాకు జ్ఞాపకం లేదు. ఆలోచించినకొద్దీ అసలతన్ని ఎరగననీ తోచింది.

"క్షమించండి. మీ పేరు?" అన్నాను దగ్గరగా వెళ్లి.

అతను మాట్లాడకుండా చిన్నగా మడిచిన కాగితం ఒకటి తీసి నా చేతికిచ్చాడు. అది చేతిలోకి తీసుకున్నాను. ఏదో పనిమీద వచ్చినట్లున్నాడు. రికమెండేషన్ లెటరు కాబోలు. "కూర్చోండి" అంటూ అతనికి కుర్చీ చూపించి నేను పడక్కుర్చీలో కూర్చున్నాను.

అతను లోపలికి రాలేదు. కూర్చోలేదు. తలెత్తి అతనికోసం చూచాను. వాకిట్లో లేడు. ఇంతలోనే ఏమైపోయాడా అనుకుంటూ కిటికీలోంచీ రోడ్డుమీదికి రెండు దిక్కులా చూచాను. ఎక్కడా కనిపించలేదు. ఏమైపోయాడు? అనుకున్నాను.

అకస్మాత్తుగా అతనెవరో నాలో తోచింది. అతను చైతన్య. అవును, సందేహం లేదు. ఆ నవ్వు...అతను చైతన్యే! నాకోసం వచ్చాడు. నాకు చెప్పాలని వచ్చాడు. ఆ లోకంనుంచీ నాకు నిజం చెప్పాలని వచ్చాడు. అవును. రాకుండా ఎట్లా వుంటాడు? నిజమైన స్నేహితుడు. అతడే నిజం! నా తీవ్రమైన కోరికను కాదనలేడు. తన ఉనికిని, తన నిజాన్ని నిరూపించుకోవడానికి వచ్చాడు. వస్తాడని నాకూ తెలుసు! ఆ కాగితంలో నాకేదో సందేశం వున్నది.

కాగితం మడతలు విప్పి చూచాను. నా కళ్లు నేనే నమ్మలేకపోయాను. కాగితం నిండా పిచ్చిగీతలు! చిన్నపిల్లలు ఓపిగ్గా కూర్చుని పేజీనిండా వ్రాసేగీతలూ, సున్నాలూ! ఆలోచనలేని ఆ పిల్లలకి మాత్రమే నిజంగా కనిపించే గీతలూ, సున్నాలూ!

ఈ పిచ్చిగీతల్ని నాకివ్వడానికే వచ్చాడా చైతన్య! అర్థం లేకపోవడమే అర్థమా యీ ప్రపంచానికి?

అర్థంలేనిది కనిపిస్తుందా?

.......................................

నిజంనాకు తెలియలేదు ఇప్పటికీ.

★★★